
క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: లోక కల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయ స్వామికి విశేష పూజలను అధికారులు, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

కుమారస్వామికి షష్టి పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో షష్టిని పురస్కరించుకుని గురువారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య అష్టోత్తరం చేసిన అనంతరం స్తోత్రపారాయణలు చేపట్టారు. పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో స్వామి వారికి అభిషేక కార్యక్రమం జరిపించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తాం

ఆత్మకూరు: ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్‌కుమార్, సీనియర్ నాయకులు ఎ.రాజశేఖర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నరసింహనాయక్, పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, మండల కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. గురువారం పట్టణంలోని డాక్టర్ ఎ.ధనుంజయ మీటింగ్ హాల్‌లో పార్టీ పట్టణ విస్తృత స్థాయి సమావేశం రామ్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ పట్టణంలో ఇళ్ల స్థలాలు, తాగునీరు, ప్రజల కనీస మౌలిక సదుపాయాల కల్పనపై పోరాటాలు సాగిస్తూ రానున్న కాలంలో వాటిని మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు సురేంద్ర, షేక్‌ఇస్మాయిల్, వీరన్న, మాబాషా, సువర్ణమ్మ, పాల శివుడు పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యమే ఉల్లాస్



ఎఫ్ఎల్ఎన్ఏ పరీక్షపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాములపాడు: మహిళలను సంపూర్ణ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ ముఖ్య ఉద్దేశమని వయోజన విద్య జిల్లా మానిటరింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం స్థానిక ధనలక్ష్మి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఎఫ్ఎల్ఎన్ఏ పరీక్షపై అవగాహన కల్పించారు. జనవరి 23వ తేదీ నుంచి మండలంలో 950 మంది మహిళలకు విద్యా బోధన చేసినట్లు చెప్పారు. వారందరికీ ఈ నెల 23న ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. చదవడం, రాయడం, లెక్కలపై 150 మార్కులకు పరీక్ష ఉంటుందని, 17 మార్కులు సాధించిన వారికి ఎన్ఐఓఎస్ సంస్థ ద్వారా ధ్రువీకరణ పత్రం ఇస్తామన్నారు. ఏపీఎం ఉమామహేశ్వరి, సీసీలు సౌభాగ్య, వెంకటరాముడు, క్రిష్ణారెడ్డి, నాగన్న పాల్గొన్నారు.

మహానందిలో చోరీ

మహానంది: మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన భక్తుల సొమ్ము చోరీకి గురైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. కర్నూలుకు చెందిన ముగ్గురు భక్తులు మహానందికి వచ్చారు. రుద్రగుండం కోనేరులో స్నానాలు ఆచరించేందుకు వెళ్తూ వారి వస్త్రాలను గట్టుపై ఉంచి వెళ్లారు. స్నానాలు చేసి బయటికి వచ్చే సరికి వస్త్రాలు కనిపించకపోవడంతో భక్తులు వెతకగా ఆలయంలోపల ఉన్న శివుడి విగ్రహం వద్ద ప్యాంటు కనిపించిందన్నారు. సుమారు రూ.5వేల నగదు, విలువైన కార్డులు పోయినట్లు వాపోయారు.

పెండింగ్ ఉపాధి బిల్లులు చెల్లించాలి



బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్న సీపీఐ నాయకులు

జూపాడుబంగ్లా: పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులు చెల్లించాలని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ పార్టీ నాయకుడు పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం మండ్లెం గ్రామంలో ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కూలీలకు వారానికోసారి బిల్లులు చెల్లించాల్సి ఉన్నా నెలలు తరబడి బిల్లులు చెల్లించకపోవడం తగదన్నారు. అలాగే పనుల వద్ద మెడికల్ కిట్లు ఏర్పాటు చేయకపోవడంతో దెబ్బలు తగిలినా కూలీలు ప్రథమ చికిత్స చేసుకునే అవకాశం లేకుండా పోయిందన్నారు. తాగునీరు, మజ్జిగ, నీడ వంటి వసతుల్లేక కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

చెక్కకాళ్లపై మల్లన్న చెంతకు..

జూపాడుబంగ్లా: ఇంటి ఇలవేల్పుగా కొల్చుకునే శ్రీశైల మల్లికార్జునస్వామి, భ్రమరాంబిక అమ్మవార్లపై కన్నడిగులకున్న భక్తి చెప్పలేనిది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కన్నడిగులు అమ్మవారికి సారెను తీసుకుని కాలినడకన ఏటా శ్రీశైలం వెళ్లడం ఆనవాయితీ. అందులో భాగంగా కర్ణాటక రాష్ట్రం, బెళ్గాం జిల్లా రాయబాగ్ తాలూకా సిద్ధాపూర్ గ్రామానికి చెందిన మారుతిమేత్రి అనే యువకుడు మూడు అడుగుల పొడవు, ఏడు ఇంచుల చుట్టుకొలతతో ఉన్న చెక్కకాళ్లపై 8రోజుల నుంచి 350 కిలోమీటర్ల మేర నడుచుకుంటూ గురువారం జూపాడుబంగ్లాకు చేరుకున్నాడు. శ్రీశైల మల్లయ్యపై ఉన్న భక్తిప్రవృత్తితో తాను మొక్కుబడిగా చెక్కకాళ్లతో నడుచుకుంటూ శ్రీశైలం వెళ్తున్నట్లు తెలిపాడు.



కాళ్లకు కర్రలు కట్టుకొని శ్రీశైలం వెళ్తున్న కన్నడ భక్తుడు

రంజాన్ పండుగకు ఏర్పాట్లు



ఈద్గా వద్ద జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

నందికొట్కూరు: రంజాన్ పండుగకు ఈద్గాల వద్ద ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని ఈద్గాలను శుభ్రం చేయించారు. ఈద్గాల వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ పండుగ రోజు ఈద్గాల వద్ద జరిగే ప్రత్యేక ప్రార్థనలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈయన వెంట కౌన్సిలర్లు చాంద్‌బాషా, అబ్దుల్ రవూఫ్, తదితరులు ఉన్నారు.

మాలల సింహగర్జనను విజయవంతం చేయండి



వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

నందికొట్కూరు: తిరుపతిలో ఈ నెల 23న తలపెట్టిన మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని మాలమహానాడు సంఘం నాయకులు వేల్పుల సుంకన్న, మనోహర్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని మాలమహానాడు కార్యాలయంలో ఛలోమాల-ఛలో తిరుపతి కార్యక్రమం వాల్ పోస్టర్లను విడుదల చేశారు. మాలల పంతం.. చంద్రబాబు అంతం అని నినాదాలు చేశారు. స్వార్థ రాజకీయాల కోసం ఎస్సీలను విభజించడం దుర్మార్గమన్నారు. మాల మేధావులు పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. కూటమి ప్రభుత్వానికి మాలల సత్తా ఏమిటో చూపించాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఏసన్న, నడిపెన్న, మాలమహానాడు నాయకులు చరణ్, తిరుపాలు పాల్గొన్నారు.

చేతివాటం ప్రదర్శించే వీఓఏలను తొలగిస్తాం



రుణాలు రికవరీ చేయాలని సీసీని ఆదేశిస్తున్న అధికారులు

- శ్రీనిధి రుణాలు వందశాతం రికవరీ చేయాల్సిందే
- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం

జూపాడుబంగ్లా: శ్రీనిధి రుణాల రికవరీలో చేతివాటం ప్రదర్శించే వీఓఏ (బుక్‌కీపర్లు)లను విధుల్లోంచి తొలగిస్తామని సెర్ప్ రికవరీ ఆఫీసర్ హేమంత్‌కుమార్, శ్రీనిధి ఏజీఎం నాగప్రసాద్ హెచ్చరించారు. గురువారం జూపాడుబంగ్లా వెలుగు కార్యాలయంలో శ్రీనిధి రుణాల రికవరీపై సీసీలు, వీఓఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలం వ్యాప్తంగా రూ.28,43,022 బకాయిలున్నట్లు తెలిపారు. భాస్కరాపురం, తరిగోపుల, 80బన్నూరు, తంగడంచ, తర్తూరు గ్రామాల్లో రుణాల బకాయిలు అధికంగా ఉన్నట్లు వెల్లడించారు. మార్చి 25తేదీ నాటికల్లా రుణాలను వందశాతం రికవరీ చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సీసీలు, వీఓఏల జీతాలు నిలిపి, సస్పెండ్ చేస్తామన్నారు. రుణాలు మంజూరు చేసే సమయంలో తిరిగి చెల్లించగలుగుతారనే నమ్మకం ఉన్న పొదుపు సంఘాలకు మాత్రమే రుణాలివ్వాలన్నారు. సమావేశంలో శ్రీనిధి మేనేజర్ మధుశేఖర్, ఏపీఎం అంబమ్మ, సీసీలు దస్సింగ్, నాగేశ్వరరావు, డీపాల్, నాగేశ్వరరావు, గాంధీ, అకౌంటెంట్ రమేష్ పాల్గొన్నారు.

రెండు మట్టి టిప్పర్లు సీజ్



టిప్పర్‌ను స్టేషన్ వద్దకు తరలించిన అధికారులు

మహానంది: మండలంలోని గాజులపల్లె వద్ద ఎర్రమట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్లు భూగర్భ, గనుల శాఖ ఏడీ వేణుగోపాల్ గురువారం తెలిపారు. రుద్రవరం మండలం కోటకొండ సమీపంలోని చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని ఫిర్యాదులు వెళ్లడంతో దాడులు నిర్వహించారు. ఈ మేరకు ఏడీ వేణుగోపాల్, జియాలజిస్ట్ శ్రీనివాసులు, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా అనుమతులు లేకుండా ఎర్రమట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను సీజ్ చేసి మహానంది పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. ఇదిలా ఉండగా మహానంది మండల పరిధిలోని అంకిరెడ్డి చెరువు నుంచి కొందరు రైల్వే పనుల పేరుతో కొంత వరకు అనుమతి తీసుకుని గ్రావెల్, ఎర్రమట్టిని తరలిస్తుండగా అనుమతుల మాటున అధికార పార్టీకి చెందిన నేతలు కొందరు ఇటుకల బట్టీలకు ఎర్రమట్టిని తరలిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపించారు. రెవెన్యూ, భూగర్భ గనుల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నాటుసారా స్వాధీనం



పట్టుబడిన నాటుసారాను చూపుతున్న పోలీసులు

ఆత్మకూరు: మండలంలోని సిద్ధాపురం క్రాస్ వద్ద మోటార్ సైకిల్‌పై అక్రమంగా నాటుసారా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కిషోర్‌కుమార్ గురువారం తెలిపారు. వారి నుంచి 60 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. నాటుసారా తయారు చేసినా, అమ్ముతున్న వారి వివరాలను 9440902585, 9177299067, 8328307774 నంబర్‌లకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దుతాం

సిద్ధాపురం గ్రామాన్ని సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దుతామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్ అన్నారు. గురువారం నవోదయం 2.0లో భాగంగా సిద్ధాపురం గ్రామంలో ఎక్సైజ్ అధికారులు, పోలీసులు పర్యటించారు. గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేసి గ్రామంలోని ప్రజలకు సారా వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఎక్సైజ్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

నేటి నుంచి విధులకు రావొద్దు!

- పలువురు ఏజెన్సీ వర్కర్లకు ఫోన్లు

మహానంది: దేవస్థానంలో పనిచేస్తున్న కొందరు ఏజెన్సీ వర్కర్లను శుక్రవారం నుంచి విధులకు రావొద్దని సంస్థ యజమానులు ఫోన్లు చేసి చెప్పడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహానంది దేవస్థానంలో రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులతో పాటు పారిశుద్ధ్య పనుల నిమిత్తం ఏజెన్సీ సంస్థ ద్వారా సుమారు 75 మంది పనిచేస్తున్నారు. గత ప్రభుత్వంలో పారిశుద్ధ్య పనుల కోసం సిబ్బందిని సరఫరా చేసేందుకు హక్కులను దక్కించుకున్న సంస్థ గడువు ముగియడంతో ఇటీవల మరో సంస్థ ఆ హక్కులను దక్కించుకుంది. దీంతో సుమారు 12 మందిని విధులకు రావొద్దని నిర్వాహకులు ఫోన్ చేసి చెప్పడంతో బాధితులు అయోమయంలో పడ్డారు.

పారిశుద్ధ్య పనులు చేసేదెవరు?

ప్రస్తుతం పనిచేస్తున్న వారిలో సుమారు 12 మందిని రావొద్దని చెప్పగా ఇప్పటికే కొందరు కొత్తగా ఇటీవల విధుల్లో చేరారు. ఏజెన్సీ ద్వారా విధుల్లో చేరుతున్న వారంతా నిబంధనల మేరకు పారిశుద్ధ్య పనుల నిర్వహణ కోసమే. అయితే దేవస్థానం వారు వారిని అవసరాన్ని బట్టి ఎక్కడైనా వినియోగించుకోవచ్చు. ఏజెన్సీ ద్వారా గతంలో నియమించబడిన కొందరు ఏళ్ల తరబడి పారిశుద్ధ్య పనులకే అంకితమయ్యారు. ఇదిలా ఉండగా కొత్తగా చేరిన వారిలో కొందరు అధికార పార్టీ నేతలతో దేవస్థానం అధికారులకు ఫోన్లు చేయించుకుంటూ రెగ్యులర్ ఉద్యోగుల తరహాలో తమకు ఫలానా చోట విధులు వేసేలా చూడండి, ఆ కౌంటర్‌లో డ్యూటీ అయితే బాగుంటుంది, టికెట్ల వద్ద చేస్తామంటూ స్థానిక నేతల ద్వారా ఆలయ అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.



మహానంది దేవస్థానం

యువకుడి ఆత్మహత్య



ఎద్దుల రవి (ఫైల్)

నందికొట్కూరు: యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నందికొట్కూరు విద్యానగర్‌లో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. విద్యానగర్‌కు చెందిన రంగస్వామికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు. గురువారం కుటుంబ సభ్యులు, బంధువులను బస్సు ఎక్కించేందుకు ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చే సరికి కుమారుడు ఎద్దుల రవి(21) ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందాడు. సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు కేసు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. యువకుడు మద్యానికి బానిసయ్యాడని.. మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడా లేక ఇతర కారణాలు ఉన్నాయా అని విచారణ చేస్తున్నట్లు చెప్పారు. మృతదేహానికి స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా మృతుడు కర్నూలు ఉస్మానియా కళాశాలలో డిగ్రీ పూర్తి చేశాడు.

శివపురంలో క్రికెట్ టోర్నమెంట్

కొత్తపల్లి: మండలంలోని శివపురం గ్రామంలో ఈనెల 24వ తేదీ జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మున్నా, సుమంత్, గోవింద్, మహెబూబ్, అన్వర్ గురువారం తెలిపారు. ఉగాది, రంజాన్ పర్వదినాలను పురస్కరించుకుని గ్రామంలోని ఎంపీయూపీ స్కూల్‌లో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విజేత జట్టుకు రూ.30,016, రన్నరప్‌కు రూ.20,016 నగదుతో పాటు ట్రోఫీ అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 23వ తేదీ సాయంత్రంలోపు ప్రవేశ రుసుం రూ.600 చెల్లించి జట్ల పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాల కోసం 9502071184, 9652027893 నంబర్లను సంప్రదించాలన్నారు.

మహానందిలో ఉద్యోగుల అంతర్గత బదిలీలు

మహానంది: క్షేత్రంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల అంతర్గత బదిలీలు చేస్తూ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఉదయం షిఫ్ట్‌లో టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌గా నాగమల్లయ్య, మధ్యాహ్నం షిఫ్టునకు ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న పి.సుబ్బారెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వీరితో పాటు పలు విభాగాల్లో పనిచేస్తున్న రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్, ఏజెన్సీ ఉద్యోగుల స్థానాలను మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇదిలా ఉండగా.. ఉన్నత ఉద్యోగుల అండదండలున్న వారికి కీలకస్థానాలు కేటాయించినట్లు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు ఆహ్వానం

జూపాడుబంగ్లా: స్థానిక కస్తూర్బా పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఆరు, ఇంటర్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌ఓ యశోద తెలిపారు. ఆరో తరగతిలో 40 సీట్లు, ఇంటర్‌లో ఎంపీసీ 40, బైపీసీ 40 సీట్లు ఉన్నట్లు వెల్లడించారు. అనాథ పిల్లలు, బడిబయట ఉన్న విద్యార్థినులు, ఒంటరి మహిళల పిల్లలు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పిలలకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఈనెల 22 నుంచి మార్చి 11వ తేదీ వరకు ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మిడుతూరు కస్తూర్బాలో..

నందికొట్కూరు: మిడుతూరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఉన్న ఖాళీలకు ఈ నెల 22వ తేదీ నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. అనాథ, బడిబయట ఉన్న పిల్లలు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

దేవాలయ నిర్మాణంపై విచారణ



దేవాలయం నిర్మాణంపై విచారణ చేస్తున్న దేవదాయశాఖ అధికారులు



పోలీస్‌స్టేషన్ వద్దకు రావాలంటూ ప్రజలకు చెబుతున్న ఆత్మకూరు రూరల్ సీఐ

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన దళితులు
- గ్రామంలో ప్రజల మధ్య వాగ్వాదం
- పోలీసుల రంగ ప్రవేశం

పాములపాడు: మండల కేంద్రంలో దేవాలయ నిర్మాణంపై జిల్లా దేవదాయశాఖ అధికారి మోహన్ గురువారం విచారణ చేపట్టారు. గ్రామంలో చెన్నకేశస్వామి ఆలయం కాకుండా రామాలయం నిర్మాణం చేపడుతున్నారని, చెన్నకేశవ స్వామికి మాత్రమే మాన్యం భూములున్నాయని గ్రామానికి చెందిన కొందరు దళిత యువకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణ చేసేందుకు వచ్చామని అధికారులు తెలిపారు. కాగా విచారణ సమయంలో ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం చోటు చేసుకుంది. వాతావరణం ఉద్రిక్తంగా మారే పరిస్థితి నెల కొనడంతో ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి పోలీసులతో రంగ ప్రవేశం చేశారు. ప్రజలు గుంపులుగా లేకుండా చెదరగొట్టారు. పోలీస్‌స్టేషన్ వద్దకు ఫిర్యాదుదారులు, దేవదాయశాఖ అధికారులు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు రావాలని సూచించారు. అక్కడే వేర్వేరుగా మాట్లాడి విషయం తెలుసుకున్నారు. సమస్య సద్దుమణిగేలా చేశారు.

ఆలయ నిర్మాణానికి రూ.60లక్షలు మంజూరు

గ్రామంలో దేవాలయం నిర్మాణానికి రూ.60లక్షలు మంజూరయ్యాయని జిల్లా దేవాదాయ శాఖ అధికారి మోహన్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఎన్ని స్వామి వారి విగ్రహాలైన ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న దేవాలయంలో సీతారాములు, ఆంజనేయ స్వామి, వెంకటేశ్వరస్వామి, చెన్నకేశవ స్వామి విగ్రహాలు ప్రతిష్ఠించనున్నారని, అందుకు ప్రత్యేక గుడులు నిర్మాణం చేపట్టడం జరిగిందని విచారణలో తేలిందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులను త్వరలో అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జనార్దన్, ఏఈ రవికుమార్‌రెడ్డి, ఎండోమెంట్ స్థపతి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఫింగర్ ప్రింట్ స్కానర్ల పంపిణీ



సచివాలయ సిబ్బందికి స్కానర్లను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

పాములపాడు: మండలంలోని అన్ని సచివాలయాలకు ఫింగర్ ప్రింట్ స్కానర్లను గురువారం ఎంపీడీఓ చంద్రశేఖర్ సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నెలా పింఛన్ పంపిణీ చేసే ఉద్యోగులకు మొత్తం 119 స్కానర్లను అందజేశామని చెప్పారు. కాగా పీ4 సర్వేపై ఈ నెల 21వ తేదీ నుంచి నిర్వహించాల్సిన గ్రామ సభలను ప్రస్తుతం వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని జిల్లాల్లో సర్వే పూర్తి కాలేదన్నారు. దీంతో మరో రెండు రోజులు సమయం ఇచ్చారన్నారు. 20శాతం హౌస్ హోల్డ్ సర్వే వచ్చిన తరువాతనే గ్రామ సభలు నిర్వహించాలని ఉన్నత అధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు వాయిదా వేసినట్లు చెప్పారు.

జనరిక్ ఔషధాయాలకు రుణం

మండలంలో రెండు జనరిక్ ఔషధాలయాల ఏర్పాటుకు ప్రభుత్వం 50శాతం సబ్సిడీతో రుణం మంజూరు చేస్తోందని ఎంపీడీఓ తెలిపారు. పాములపాడు యూనియన్ బ్యాంకు ద్వారా రుణం మంజూరు చేస్తామన్నారు. ఒక్కో యూనిట్‌కు రూ.8లక్షలు లోన్ ఇస్తామని తెలిపారు. బీ ఫార్మసీ, డీఫార్మసీ విద్యార్హత కలిగిన వారు అర్హులని చెప్పారు. బీసీ, ఈడబ్ల్యూఎస్ వారు మాత్రమే ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆటపాటలతో విద్యనందించాలి



అంగన్‌వాడీ వర్కర్లకు అవగాహన కల్పిస్తున్న ఏసీడీపీఓ మంగవల్లి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్‌లు

జూపాడుబంగ్లా: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆట, పాటల ద్వారా విద్యావంతులుగా తీర్చిదిద్దాలని అదనపు సీడీపీఓ మంగవల్లి అన్నారు. గురువారం జూపాడుబంగ్లా కస్తూర్బా పాఠశాలలో మండలంలోని 38 కేంద్రాలకు చెందిన అంగన్‌వాడీ వర్కర్లకు పోషణ్‌భీ-పడావ్‌భీ కార్యక్రమంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్త్రీలు గర్భం దాల్చిన వెంటనే వారిపేర్లు నమోదు చేసుకుని వారికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా క్రమం తప్పకుండా పౌష్టికాహారం ఇవ్వడంతో పాటు ఎప్పటికప్పుడు ఆరోగ్యపరమైన సలహాలు, సూచనలు అందించాలని సూచించారు. ప్రసవించిన అనంతరం ముర్రుపాల ప్రాముఖ్యతను వివరించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నిర్మలమ్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ

ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పోషన్ భీ పడాయి భీలో భాగంగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ కో-ఆపరేషన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ వారి సహకారంతో గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని బండిఆత్మకూరు, వెలుగోడు, ఆత్మకూరు మండలాలకు చెందిన అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సూపర్‌వైజర్‌లు సూర్యకుమారి, శివకుమారి, అంజలి, కుమారి, కోమల, రమ, వినోలియా పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పద్మావతిబాయి, శ్రీశైలం నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

తాగునీటి వృథా.. భవిష్యత్ వ్యథ

పగిడ్యాల: బొట్టు బొట్టు ఒడిసి పట్టు.. నీటి వృథాను అరికట్టు అంటూ ప్రభుత్వం పెద్ద పెద్ద హోర్డింగ్‌లు పెట్టి చేస్తున్న ప్రకటనలు ప్రచారానికే పరిమితమయ్యాయి. భగభగ మండే భానుడి ప్రతాపానికి భూగర్భ జలాలు సైతం పాతాళానికి పడిపోతున్నాయి. అయితే నీటి వనరులను సంరక్షించి గ్రామీణులకు అందించాల్సిన రక్షిత మంచినీటి సరఫరా ఎండమావిగా మారుతోందని లక్ష్మాపురం గ్రామ ప్రజలు చెబుతున్నారు. సురేష్‌రెడ్డి ఇంటి వద్ద రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన మినీ సిస్టం ట్యాంక్ పైప్ లింక్‌పోయి ట్యాంక్‌కు నీరు ఎక్కకుండా వృథాగా భూమిలో కలిసిపోతున్నా పట్టించుకునే నాథుడు లేరని స్థానికులు పేర్కొంటున్నారు.



లింక్ ఊడిపోయి వృథాగా పోతున్న తాగునీరు

స్థానికంగా ఉండి ప్రజలకు సేవలందించాల్సిన పంచాయతీ కార్యదర్శి నారాయణమ్మ కర్నూలు నుంచి విధులకు హాజరుకావడం వల్ల గ్రామంలో పాలన పడకేసిందని ఆరోపిస్తున్నారు. గ్రామ సర్పంచ్ కూడా ఇంటికే పరిమితమై సమస్యలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

దళిత కాలనీల్లో సమస్యలను పరిష్కరించాలి

నందికొట్కూరు: దళిత కాలనీల్లో నెలకొన్న సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని సీపీఎం నాయకుడు నాగేశ్వరరావు కోరారు. గురువారం పట్టణంలోని దళిత కాలనీల్లో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏబీఎం పాలెం, సీఎస్ఐ పాలెంలో కర్రెమ్మ గుడి స్థలం, మెట్ల బావికి చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించాలన్నారు. రెండు కాలనీల్లో కమ్యూనిటీ హాలు ఏర్పాటు చేయాలని కోరారు.

ఉదయం త్వరగా పనులకు హాజరవ్వాలి



ఉపాధి పనుల వద్ద కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

పాములపాడు: ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలు ఉపాధి పనులకు ఉదయం త్వరగా హాజరవ్వాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని మిట్టకందాల గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. పని ప్రదేశంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. తప్పనిసరిగా టెంటు ఏర్పాటు చేసుకోవాలని, తాగునీరు వెంట ఉంచుకోవాలని, ప్రథమ చికిత్స కిట్టు ఉంచాలని సూచించారు. కూలీల హాజరు, మస్టర్ రోల్‌ను పరిశీలించారు. ఆయన వెంట ఏపీఓ విమలమ్మ, టీఏ శ్రీధర్ ఉన్నారు.

సచివాలయం తనిఖీ

మిట్టకందాల గ్రామంలోని సచివాలయాన్ని ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరుపట్టీని పరిశీలించారు. పీ4, జీఎస్‌డబ్ల్యూ, హౌస్ హోల్డ్ సర్వేల గురించి అడిగి తెలుసుకున్నారు.